క్లుప్తంగా

ఘనంగా గంగ జాతర



పూజల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కమ్మవారి పల్లె పంచాయతీ మజరా గ్రామమైన లక్ష్మంపల్లెలో ఆదివారం ఘనంగా గంగ జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామ సమీపంలోని గంగమ్మ ఆలయంలోని అమ్మవారిని పూజారులు ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయమే గ్రామస్తులు మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు జెడ్పీ చైర్మన్‌కు గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం గంగమ్మ ఆలయానికి చేరుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామసుబ్రహ్మణ్యం చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

కోవెలకుంట్ల: ఎస్సీ వర్గీకరణ చేపట్టి చట్టబద్ధత కల్పించాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకుడు కత్తి సుబ్బయ్య కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేపట్టక పోవడంతో మాదిగలు అన్ని విధాలా నష్టపోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం త్వరితగతిన పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం తలపెట్టినట్లు పేర్కొన్నారు. మాదిగలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



హోమం నిర్వహిస్తున్న చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి, గ్రామ పెద్దలు

అవుకు: మండల పరిధిలోని కొండమనాయుని పల్లెలో నూతనంగా నిర్మించిన జగద్గురు శ్రీక్రిష్ణ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ముందుగా ఆలయం ఎదుట ధ్వజస్తంభం, అనంతరం శ్రీ జగద్గురు శ్రీక్రిష్ణుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చల్లా సూర్య ప్రకాశ్ రెడ్డికి, నాయకుడు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డికి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం వారు హోమంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తాదులకు స్వామివారి మూలవిరాట్ దర్శన భాగ్యాన్ని కల్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నారాయణ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, శివారెడ్డి, శ్రీనివాస రెడ్డి, యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన ముఖ్యమంత్రి పీఏ

ప్యాపిలి: పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కొండయ్య కుమారుడి వివాహం గత నెలలో జరిగింది. వివాహానికి వచ్చి వధూవరులను ఆశీర్వదించాలని కొద్ది రోజుల క్రితం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన కొండయ్య ఆహ్వానపత్రిక అందజేశారు. ముఖ్యమంత్రి తరఫున ఆయన పీఏ రవిశేఖర్ యాదవ్ ఆదివారం కొండయ్య ఇంటికి వచ్చి వధూవరులు లక్ష్మీజయచంద్ర, శిరీషలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో రాష్ట్ర మినరల్ మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వీరప్రతాప్ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జునరెడ్డి, ఉప సర్పంచ్ గడ్డం భువనేశ్వర్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు బోరెడ్డి రాము, బాలయ్య, నాయకులు సోమశేఖర్, సతీష్, బాలరంగయ్య, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ సుబ్బరాజు బదిలీ

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వహించిన సుబ్బరాజుకు ప్రభుత్వం ఇటీవలనే ఎంపీడీఓగా పదోన్నతి కల్పించడంతో ఉన్నతాధికారులు కొత్తాళం ఎంపీడీఓగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎంపీడీఓను నియమించాల్సి ఉంది. ఏడాది క్రితం మహానంది నుంచి బదిలీపై కొలిమిగుండ్లకు వచ్చిన సుబ్బరాజు ఇన్‌చార్జ్‌గా కొనసాగారు.

నెరవేరుతున్న సొంతింటి కల



ఉడుములపాడు లేఅవుట్ జగనన్న కాలనీ వ్యూ



దొరపల్లె లేఅవుట్ జగనన్న కాలనీ వ్యూ

- ఊళ్లను తలపిస్తున్న జగనన్న కాలనీలు
- సకల వసతులు సమకూర్చుతున్న అధికారులు
- ఊపందుకున్న గృహ నిర్మాణాల పనులు

డోన్ : పేదల సొంతింటి కల నెరవేరుతోంది. ఇళ్లు లేదనే మాటే వినపడకూడదంటూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గృహనిర్మాణాలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పేద, మధ్య తరగతి ప్రజల సొంతింట కల నేరవేర్చేందుకు ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు కేటాయించింది. ఈ మేరకు లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టారు. జోరుగా గృహ నిర్మాణాలు సాగుతుండడంతో జగనన్న కాలనీలు ఊళ్లను తలపిస్తున్నాయి. జిల్లాకు మంజూరైన 51,871 పక్కాగృహాల్లో 17,773 గృహాలను లబ్ధిదారులు పూర్తి చేశారు. మరి కొన్ని బేస్‌మటం, ఆర్‌సీ స్థాయిలో గృహాల నిర్మాణాల సాగుతున్నాయి. ప్రత్యేకించి డోన్ పట్టణ సమీపంలో దొరపల్లె, ఉడుములపాడు లేఅవుట్లలో 3,900 ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే దాదాపు 3వేల ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయని ఏఈ వీరేంద్ర తెలిపారు. ఈ లేఅవుట్లలో విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం, వైర్లను లాగడం పూర్తవడమే కాక, మీటర్లను కూడా లబ్ధిదారులకు ఇవ్వడం చకచకా సాగిపోయాయి. పలు లేఅవుట్లలో బోర్లను వేసి నీటి సమస్య లేకుండా చేశామని అధికారులు అంటున్నారు. కొందరు ఇప్పటికే ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేసి గృహ ప్రవేశాలను కూడా చేశారు. ప్రభుత్వం లబ్ధిదారులకు ఇవ్వాల్సిన ఇసుక, సిమెంట్, స్టీల్‌ను నిర్మాణ దశలను మేరకు అందజేస్తున్నారు. ప్రభుత్వం అన్ని రకాల మెటీరియల్స్‌తో కలిపి రు.1.80లక్షలు అందజేస్తుండగా పొదుపు లక్ష్మి గ్రూపులో సభ్యులైన లబ్ధిదారులకు రూ.30వేల వరకు వడ్డీ లేని రుణం సౌకర్యం కల్పించింది. దీంతో గృహ నిర్మాణాలు ఊపందుకున్నాయి.

జిల్లాలోనే డోన్ నియోజకవర్గానికి అధికం

నంద్యాల జిల్లాకు మొత్తం 51,871 ప్రభుత్వ పక్కా గృహాలు మంజూరయ్యాయి. అయితే ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో డోన్ నియోజవర్గానికి అత్యధికంగా 11,586 గృహాలు మంజూరయ్యాయి. అదేవిధంగా ఆళ్లగడ్డ నియోజకవర్గానికి – 10,321, శ్రీశైలం, ఆత్మకూరు – 11035, నంద్యాలకు – 5,735, బనగానపల్లె, కోవెలకుంట్ల – 7,398, నందికొట్కూరు నియోజకవర్గానికి 5,796 పక్కాగృహాలను మంజూరు చేసింది ప్రభుత్వం. రాష్ట్రంలో అర్బన్ ఏరియాల్లో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర ప్రకారం ఇంటి నివేశ స్థలాలను ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే మంత్రి బుగ్గన ప్రాతినిథ్యం వహిస్తున్న డోన్ నియోజకవర్గంలో అర్బన్ ప్రాంతంలోనూ సెంటున్నర ప్రకారం లబ్ధిదారులకు ఇంటి నివేశ స్థలాలను కేటాయించడం జరిగింది. దీంతో మంత్రి బుగ్గనకు డోన్ నియోజకవర్గ ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

సొంతింటి కల సాకారం



మాది నిరుపేద కుటుంబం, అద్దె ఇంటిలో నివాసం ఉండి అనేక అవస్థలు పడుతున్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తన పేరుపై ఇంటి నివేశన స్థలంతోపాటు పక్కాగృహం మంజూరైంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో తమ సొంతింటి కల సాకారమైంది. – వరలక్ష్మి, కొండపేట, డోన్.

మళ్లీ సీఎంగా జగనన్నే



నేను పోలీసుస్టేషన్ వద్ద టీ కొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తున్నా. నా పేరుపైన జగనన్న కాలనీలో స్థలం కేటాయించడంతో ప్రభుత్వం ఇచ్చే డబ్బుతో కొంత కలిపి పక్కా గృహాన్ని నిర్మించుకున్నా. రాష్ట్రంలో పేదలకు మేలు జరగాలంటే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలి. – సుజాత, పాతపేట, డోన్.

చకచకా బిల్లులు



జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు వెంటవెంటనే బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తుంది. ఇప్పటికే కాలనీలో నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాం. డ్రైనేజీ, సీసీ రోడ్లు, వివిధ నిర్మాణాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఇళ్లు నిర్మించుకోని వ్యక్తుల పట్టా రద్దు చేసేందుకు నోటీసులు కూడా అందజేశాం. ప్రభుత్వ సహకారంతో పేదలు సొంతింటి కల నెరవేర్చుకోవాలి. – రాజశేఖర్, హౌసింగ్ డీఈ, డోన్.

మారిన వాతావరణం

కొలిమిగుండ్ల: రోహిణి కార్తీలో భానుడు భగభగలకు ఎండలు మండిపోతున్న సమయంలో ఆదివారం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. మండల వ్యాప్తంగా తేలిక పాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ ఛాయలే కనిపించలేదు. ఎండల తీవ్రతతో అల్లాడిపోతున్న జనానికి ఊరట లభించింది.

వైద్యశాలకు వెళ్లి పింఛన్ కానుక పంపిణీ

బనగానపల్లె రూరల్ : మండలంలోని పలుకూరుకు చెందిన వృద్ధురాలు మైల సుబ్బమ్మ నంద్యాల శాంతి రామ్ వైద్యశాలలో చికిత్స పొందుతుంది. వలంటీర్ ఉపేంద్ర ఆచారి ఆదివారం వైద్యశాలకు వెళ్లి వైఎస్సార్ పింఛన్ కానుకను వృద్ధురాలుకు బయోమెట్రిక్ ద్వారా అందజేశారు. తన ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని తన వద్దకు వచ్చి పింఛన్ అందజేసిన వలంటీర్‌కు వృద్ధురాలు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు బండలాగుడు పోటీలు

సంజామల: మండల పరిధిలోని నొస్సం గ్రామంలో వెలసిన శ్రీబుగ్గ వేంకటేశ్వరస్వామి మహోత్సవాలు పురస్కరించుకుని ఈనెల 5న రాష్ట్ర బండలాగు ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు సంతోష్ తెలిపారు. న్యూకేటగిరి విభాగంలో నిర్వహించే రాతిదూలం లాగుడు విజేతల వృషబాల యాజమన్యాలకు వరుసగా రూ.60వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు చొప్పున అందజేస్తామన్నారు. వృషభాల యజమానులు 5వ తేదీ ఉదయం 6గంటల లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

కోవెలకుంట్ల: యువతీ, యువకులు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సీఐ నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని బాబానగర్‌లో ఆదివారం అబుల్ కలాం ఆజాద్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత రక్తదాన, వైద్య శిబిరాన్ని సీఐ ప్రారంభించారు. కార్యక్రమానికి స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డాక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, సృజన, ఎస్ఐ వెంకటరెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ దిల్‌కబాష, ముస్లిం మతపెద్దలు మౌలానా ముఫ్తి అబ్దుల్ హది, మౌలానా యాసిన్, అబ్దుల్ సలాం, ప్రగతి విద్యా సంస్థల అధినేత ఎస్‌ఏ గఫూర్, మాజీ వార్డుమెంబర్ అక్బర్‌బాషా హాజరయ్యారు. పట్టణానికి చెందిన 50 మంది యువకులు రక్తదానం చేశారు. అనంతరం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

వడ్డెరుల ఆత్మీయ సభను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

డోన్ టౌన్: పట్టణంలోని మధు ఫంక్షన్ హాల్‌లో 9వ తేదీన నిర్వహించే ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి వడ్డెరులు తరలివచ్చి విజయవంతం చేయాలని వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షులు నాగరాజు పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం సమ్మేళనంపై నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి మంత్రి బుగ్గనరాజేంద్రనాథ్‌రెడ్డితో పాటు చంద్రగిరి ఎమ్మెల్సీ ఏసురత్నం, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ దేవేల రేవతి, మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తదితర ప్రముఖులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో గౌరవ అధ్యక్షుడు కొత్తకోట నాగరాజు, నాయకులు ఎల్లస్వామి, లక్ష్మీనారాయణ, గంగరాజు, తిమ్మాపురం సురేష్, రామాంజి, రంగస్వామి, శివచరణ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రారంభమైన విగ్రహాల ప్రతిష్ఠోత్సవం



శ్రీమారెమ్మ,కుంటమ్మ, పోతురాజు విగ్రహాల గ్రామోత్సవం దృశ్యం

బనగానపల్లెరూరల్: మండలంలోని జ్వాలాపురంలో నూతనంగా పునఃనిర్మించిన గుడిలో శ్రీమారెమ్మ, కుంటమ్మ, పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గుడిలో వేదపండితుల ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మారెమ్మ, కుంటమ్మ, పోతురాజు విగ్రహాలను ట్రాక్టర్‌లో గ్రామోత్సవం నిర్వహించారు. సోమవారం విగ్రహాల ప్రతిష్ఠ ఉంటుందని గ్రామ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తిరుపాల్, నారాయణ రెడ్డి, ఉప్పు ప్రతాప్‌రెడ్డి, బాలతిమ్మయ్య, బ్రహ్మయ్య ఆచారి, శ్రీపతి నారాయణ, తిరుమలయ్య, రామకృష్ణ గంధంహుస్సేని తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా గార్ధభాల పరుగు పందెం పోటీలు



పరుగు పందెంలో గార్ధభం

సంజామల: మండల పరిధిలోని నొస్సం గ్రామంలో వెలసిన శ్రీబుగ్గ వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా సాగుతున్నాయి. అర్చకులు శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం గరుడోత్సవం ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆర్‌అండ్‌బీ రహదారిలో నిర్వహించిన గార్ధభాల పరుగు పందెం పోటీలు రసవత్తరంగా సాగాయి. కడప జిల్లా మైలవరం మండలం జంగాలపల్లికి చెందిన అంజి గార్ధభం ప్రథమ స్థానంలో నిలిచి రూ.15వేలు కైవసం చేసుకుంది. నంద్యాల జిల్లా వెలుగోడు మండలం వేల్పనూరు గ్రామానికి చెందిన నాగయ్య గార్ధభం రెండవ స్థానంలో రూ. 10వేలు, నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం పెద్ద వంగలికి చెందిన పెద్ద పాములేటి గార్ధభంమూడవ స్థానం రూ.5 వేలు కైవసం చేసుకున్నాయి. గార్ధబాల యజమానులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్కిరెడ్డి శివరాంరెడ్డి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి అల్వకొండ మద్దిలేటి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఓహెచ్‌ఆర్ ట్యాంక్ ప్రారంభానికి సిద్ధం

సంజామల: మండల పరిధిలోని బొందలదిన్నె గ్రామంలో జల్ జీవన్ మిషన్ పథకం కింద రూ.35లక్షలతో చేపట్టిన ఓహెచ్‌ఆర్ ట్యాంక్ నిర్మాణం పూర్తయింది. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారంలో భాగంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో రూ.35లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు చేపట్టిన 40వేల లీటర్ల నీటి సామర్థ్యంతో నిర్మించిన ఓహెచ్‌ఆర్ ట్యాంక్ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. జల్ జీవన్ పథకంతో గ్రామంలో ఇప్పటికే ఇంటింటికి సురక్షితమైన తాగునీరు సరఫరా అందించాలనే ఉద్దేశంతో ఉచితంగా కుళాయిలను ఏర్పాటు చేశారు. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుండడంతో గ్రామస్తులు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఓహెచ్‌ఆర్ ట్యాంకును ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాటు చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉపేంద్రారెడ్డి తెలిపారు.



నిర్మాణం పూర్తయిన ట్యాంకు

బడి తెరచిన రోజే విద్యార్థులకు విద్యాకానుక



స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉంచిన జగనన్న విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ సుధాకర్‌రెడ్డి

బనగానపల్లెరూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలు ప్రారంభించిన రోజే ప్రతి విద్యార్థికి జగనన్న విద్యాకానుక కిట్స్ పంపిణి చర్యలు తీసుకున్నట్లు డోన్ డిప్యూటీ డీఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం బనగానపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిల్వ ఉంచిన జగనన్న విద్యా కానుక కిట్లను ఆటోల ద్వారా పాఠశాలలకు తరలించే కార్యక్రమాన్ని ఆయన పరిశీంచారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈఓ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే ప్రతి మండలానికి పాఠ్యాపుస్తకాలు, యూనిఫాం, బెల్ట్స్, నోటుబుక్స్, డిక్షనరీ, విక్టోరియ డిక్షనరీలు వచ్చాయని, షూస్, బ్యాగ్స్ రావాల్సి ఉందన్నారు. 12వ తేదిన పాఠశాలలు తెరచిన రోజే విద్యా కమిటీ చైర్మన్స్, ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా కిట్స్ అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ స్వరూప, హెచ్‌ఎం నాగభూషణం, సీఆర్‌పీలు సుధాకర్‌రావు, శివరామమద్దిలేటి, సుబ్బలక్ష్మీ, పుల్లారెడ్డి, రాజేశ్వరి, నాగచంద్రుడు, శివప్రసాద్, ఐఈఆర్‌టీలు ఇందిరా, శ్రీనివాసులు, పీఆర్‌టీలు శివరామయ్య, చంద్రకళ పాల్గొన్నారు.

పాఠశాలలకు 'విద్యాకానుక' సరఫరా

కొలిమిగుండ్ల: విద్యా సంవత్సరం ప్రారంభం రోజే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్‌లు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంఈఓ జిలానీ బాష తెలిపారు. ఆదివారం కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టోరేజీ పాయింట్ నుంచి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆటోల్లో నేరుగా పాఠశాలలకు చేరవేస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలానికి 27,800 పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. 4200 మంది విద్యార్థులకు యూనిఫాం,బెల్ట్‌లు వచ్చాయన్నారు. నోట్‌బుక్‌లు, బూట్లు, టై తదితర వస్తువులు త్వరలోనే వస్తాయన్నారు. బడి తెరిచిన రోజే విద్యాకానుక పంపిణీ చేయాలని ఉద్దేశంతో ముందుస్తుగా ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పాఠశాలలకు సరఫరా చేస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు.

పాఠ్యపుస్తకాల గోడౌన్ తనిఖీ



పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న సుధాకర్‌రెడ్డి

డోన్ : స్థానిక ప్రభుత్వ జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిల్వ ఉంచిన విద్యార్థులకు సంబంధించిన పాఠ్యపుస్తకాల గోడౌన్‌ను డిప్యూటీ డీఈఓ సుధాకర్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. జగనన్న విద్యాకానుక కిట్లను ఎంఈఓ ప్రభాకర్‌తో ఆయన పరిశీలించారు. యూనిఫారం, బ్యాగ్, బెల్టు, షూస్, టెస్ట్ బుక్స్, నోట్ బుక్స్, డిక్షనరీలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్కూళ్ల ప్రారంభం రోజే విద్యార్థులకు జగనన్న కిట్లు అందజేసుందుకు చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. సకాలంలో విద్యార్థులందరికీ 2023–24 విద్యా సంవత్సరానికి గానూ ప్రభుత్వం నుండి మంజూరైన అన్ని వసతులను విద్యార్థులకు అందజేస్తామని ఆయన తెలిపారు.

క్రైం కార్నర్

భర్తపై కేసు నమోదు

అవుకు: మండల పరిధిలోని ఓబుళాపురం గ్రామంలో భార్య మృతికి కారణమైన భర్తపై కేసు నమోదు చేశామని ఎస్ఐ నరేంద్రకుమార్ ఆదివారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు గ్రామానికి చెందిన దిద్దికాటి రాముడుకు బేతంచెర్ల మండలం బుగ్గానిపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీప్రసన్న (27)తో ఎనిమిదేళ్ల క్రితం వివాహం అయ్యింది. కొన్నాళ్ల నుంచి ఆమెపై భర్త అనుమానం పెట్టుకొని శారీరకంగా, మానసికంగా చిత్రహింసలకు పాల్పడుతున్నాడు. శనివారం ఆమెను కొట్టి గాయపరిచాడు. దీంతో ఆమె మనస్థాపానికి గురై ఇంట్లోనే క్రిమి సంహారక మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. చికిత్స నిమిత్తం అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా కోలుకోలేక మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బేతంచెర్ల: పట్టణంలోని కొత్తబస్టాండు సమీపాన నివాసం ఉండే ఓ వ్యక్తి చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ ఎంవీ రమణ తెలిపిన వివరాల మేరకు కొత్తబస్టాండు కాలనీకి చెందిన షేక్ మహబూ(60) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఎక్కడ చూపించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది టాయిలెట్ క్లీనర్ తాగి గత నెల 27న ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం బాధితుని కర్నూలుకు తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మరణించాడు. మృతుని భార్య షేక్ అగ్బర్ బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గృహ ప్రవేశానికి హాజరైన ధర్మవరం, కమలాపురం ఎమ్మెల్యేలు



నాయకులతో ముచ్చటిస్తున్న కేతిరెడ్డి

డోన్ టౌన్: రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ సభ్యులు, ఓంటెద్దు సుధ రఘునాథ్‌రెడ్డి (ఏపీ రాష్ట్ర కనీస వేతన సలహా బోర్డు చైర్మన్)దంపుతుల నూతన గృహ ప్రవేశానికి పలువురు ప్రముఖులు తరలివచ్చారు. ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి, రాష్ట్ర భూగర్భఖనిజ గనుల కార్పొరేషన్ సభ్యులు వీరప్రతాప్‌రెడ్డి, ఫారెస్టు కార్పొరేషన్ సభ్యులు మల్లికార్జునరెడ్డి హాజరయ్యారు. అదేవిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడు రవిశేఖర్‌యాదవ్, తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కుమారుడు హర్షవర్ధన్ తదితరులు హాజరయ్యారు. శ్రీసత్యనారాయణ స్వామి వత్ర పూజల్లో పాల్గొని రఘునాథరెడ్డి సుధ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లో శ్రమదానం



కానిస్టేబుళ్లతో కలిసి మట్టి పనులు చేస్తున్న సీఐ ప్రియతం రెడ్డి

బేతంచెర్ల: స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ ప్రియతం రెడ్డి, పోలీస్ సిబ్బంది ఆదివారం శ్రమదానం చేశారు. ఉదయం పోలీస్ సిబ్బందితోపాటు సీఐ కూడా శ్రమదానం చేస్తుండడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. పోలీస్ స్టేషన్ ఆవరణను సీఐ శుభ్రం చేస్తున్న తీరు అక్కడివారిని ఆలోచనలో పడేసింది. సీఐ ప్రియతం రెడ్డి అంకితభవాన్ని కళ్లతోనే అభినందించారు చూపరులు.

వేరుశనగ విత్తనాల పంపిణీ



వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్ : మండలంలోని గుమ్మకొండ గ్రామంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా మంజూరైన వేరుశనగ విత్తనాలను రైతులకు ఆదివారం పంపిణీ చేశారు. ఏఓ అబ్దుల్ షఫీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, అనుమన్న పాల్గొన్నారు. 30 కేజీల వేరుశనగ విత్తన ప్యాకెట్లు మూడు చొప్పున విత్తనశుద్ధి మందుతో కలిపి రైతులకు రూ.575లకు పంపిణీ చేస్తున్నట్లు అబ్దుల్ షఫి తెలిపారు. గ్రామంలో 125 మంది రైతులకు వేరుశనగ విత్తనాలను ఇప్పటికే పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏరువాక పౌర్ణమి పూజలు

బనగానపల్లెరూరల్: మండలంలోని పలుకూరు గ్రామంలో శ్రీరామేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు భాస్కరయ్య ఆధ్వర్యంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో ఏరువాక పౌర్ణమి పూజలు నిర్వహించారు. రామేశ్వర స్వామివారికి అభిషేకం, అర్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు రైతులు తమ వృషభాలను అందంగా అలంకరించి ఆలయంలోని నందీవిగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు భాస్కరయ్య మాట్లాడుతూ రైతులు పౌర్ణమి రోజు శివుడికి ప్రత్యేక పూజలు చేసి, పొలంలో వ్యవసాయ పనులు ప్రారంభించడం ఆనవాయితీ అన్నారు. కార్యక్రమంలో రైతులు గుండె వెంకట్రామిరెడ్డి, కురువ మహేష్, కురవ సింగారపు చిన్న కుక్కలయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన మున్సిపల్ భవనాన్ని త్వరలో ప్రారంభిస్తాం



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్ : స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో రూ.29లక్షలతో నిర్మించిన మున్సిపల్ నూతన భవన ఆవరణలో ల్యాండ్ స్కేప్, ఇంటర్నల్ రోడ్డు, వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులను ఆదివారం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ పరిశీలించారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా మున్సిపల్ భవనాన్ని త్వరలో ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. చైర్మన్ వెంట కౌన్సిలర్లు కటిక వేణు, మల్లికార్జునరెడ్డి, పట్టణ సచివాలయ కన్వీనర్ కురుకుంద హరి ఉన్నారు.